5055
శ్రీకాకుళం

# ఆక్రమణ

పట్టణం పట్టణం యావత్తూ పీకేసిన పందిరిలా వుంది. తుఫాను సృష్టించిన బీభత్సం తరవాత నాశనం అయిపోయిన అరటితోటలా వుంది. ఉడతలు పీకిన తాటిటెంకలా వుంది. పట్టణం అంటే పెద్దపట్టణం ఏం కాదు. మున్సిపాల్టీ కాబోయి రెండుసార్లాగిపోయి, రెండేళ్ల క్రితమే మున్సిపాల్టీ అయిన ఊరది. అక్కడ సర్వత్రా హాహాకారాలుగా వున్నాది.

ఇళ్లూవాకిళ్లూ పోయినవాళ్లు హాహాకారాలు చేస్తున్నారు. గుండెలు బాదుకుంటున్నారు. రోడ్లు వెడల్పయ్యాయని, ఆక్రమణలు తొలిగేయనీ కొందరూ, తమ ప్రతిపక్షాల కొట్లు కొట్టెయ్యడం వల్ల తమకిక పోటీ లేదని కొందరూ ఆనందంగా ఉన్నారు. నిలవ నీడలేక వేలాదిమంది జనం రోడ్ల మీద పడ్డారు. ఏళ్లతరబడి నివసిస్తున్న చెట్టు కూలిపోతే చుట్టుపక్కల ఏదిక్కూలేక అల్లాడిపోతున్న పక్షుల్లా వుంది వాళ్ల పరిస్థితి.

"నాదారోళ్లం బాబూ. మా కష్టింసుకం ఎవుడు సూస్తాడు కొడక" అన్నదొక ముసిల్దాయి. కడకు చెట్టునీడ కూడా లేని ముసలివరడ. కుటుంబం మొత్తం తెల్లారిపోయి, నీకాళ్లూ నీకాళ్లూ పట్టుకొని కుళ్లుకాలవ మీద బడ్డీవో గుడిసో తెలియని చిన్నయిల్లు కట్టుకుంది.

"ఎంత మొత్తుకున్నా యినుకున్నారుగారు గొల్లిగాళ్లు. ఆ మేస్త్రిరి బాడుకోవు తెల్సినోడే. తారుపుడు గుల్లనాయాల. దగ్గిరుండి మరీ పీకించీసినాడు. అడి బుర్ర సిక్కియ్య" అని నోటికొచ్చినట్టల్లా తిడుతున్నాది. ముసిల్ది. కోర్టులో కేసువేసి స్టే తెచుకున్న కొద్దిమంది - ఆక్రమణల తొలగింపునుంచి తప్పించుకుని నిలదొక్కుకున్నందుకు ఆనందంగా వున్నారు.

అవూళ్లో సబ్‌కలక్టరాఫీసు దగ్గిర జంక్షన్, పెద్ద షాపింగ్ సెంటరూ, కాఫీబోర్డు ఆఫీసు ఐదురోడ్ల జంక్షను నాలుగైదు పెద్దహోటళ్లు కొత్తగా కట్టిన 'పంచమి' లాడ్జింగ్‌హౌసూ. కృష్ణమందిరం జంక్షన్‌లో పెద్ద పెద్ద మెడికల్ షాపులూ రామయ్యడాక్టరు ఆస్పత్రి వగైరా. కూరగాయల బజారు నానుకొని మూడు సినిమా హాళ్లున్న సెంటరూ... ఇవి చాలా పెద్ద జంక్షన్లు. బాగా జనం రద్దీ వుండే సెంటర్లూ. రోడ్లు ఇరుకు. కాలేజీకి వెళ్లేరోడ్డూ, పోలీసు స్టేషన్ దగ్గిర కూడా ఒక మాదిరి రద్దీగా వుంటుంది గాని దీపాలు పెడితే అలికిడి వుండదు. ఈ అన్నిట్లోనూ కృష్ణమందిరం సెంటరు మరీ ఘోరం. అది పాతటౌను కింద లెక్క. మార్కెట్టుకీ సినిమా హాళ్లకీ కూడా అదే దారి. కాలేజీ దాటేక కట్టిన ఆర్టీసీ కాంప్లెక్సూ, అక్కడ తయారయిన కోలనీ చాలా బావుంటాయి. కాని అది పట్టణం కాదు. నీలంపేట

పంచాయితీ. రెండు పెద్ద ధాన్యం మిల్లులూ, నూనె మిల్లూ, ఆరండ్‌బీ గెస్టు హౌసూ, కొత్త సినీమా హాలూ నీలంపేట పంచాయితీలోవే అవి కూడా మున్సిపాల్టీలో కలిసిపోవలసిందే. నీలంపేట ప్రెసిడెంటు రాజకీయం జేసి తప్పించేశాడు. ఒక లక్షఖర్చు పెట్టేడని వినికిడి. నీలంపేట పంచాయితీలో ఆక్రమణల తొలగింపు పేర ఒక్క ఇటికబెడ్డకూడా ముట్టుకోలేదు.

ఒకపదేళ్ల బట్టి పట్టణం వరసావాడీ లేకుండా పెరిగిపోయింది. ట్రాఫిక్ పోలీసులకి మాచెడ్డ తలనెప్పిగా వుంది. కొన్నాళ్లు ఏంటీనక్సలైటుస్క్వాడ్‌లో పనిచేసి, ఎస్పీదొరగారితో తగువు తెచ్చుకుని, ట్రాఫిక్ ఎస్సయిగా వొచ్చాడు పరదేశిబాబు. పరమ ఛండాలుడు, క్రూరుడు, నీచుడూను. అంతా తనే నొల్లీసుకుంటున్నాడు. ఆక్రమణలున్నప్పుడూ, తొలగించినప్పుడూ రెండిందాలా 'సొమ్ము పిసికేస్తున్నాడు' ట! రోడ్డు పక్క స్కూటర్ రిపేర్లు, జీపులూ, కార్లూ రిపేర్లు చిన్న చిన్న సైకిలు షాపులు, బడ్డీలు, మిఠాయి కొట్లు, పకోడీలు, బజ్జీలు అమ్మేబళ్లు, పళ్లదుకాణాలు, పూలదుకాణాలు, జోళ్లషాపులు, కొన్ని బట్టలషాపులు, చిల్లర ఫాన్సీసామాన్లమ్మే కొట్లు - మహా పట్టణాల్లో ఎన్నిరకాలుంటాయో - అన్ని రకాలూ వున్నాయిక్కడ. పెద్ద పెద్ద అద్దాల షాపుల్లో దొరికే సమస్తమూ రోడ్డువార దుకాణాల్లో దొరుకుతాయి.

⋆⋆⋆

ఐదురోడ్ల జంక్షన్లో పైడిరాజు టీకొట్టుపోయింది. సత్యారావు సైకిలు షాపుపోయింది. మాధవ మిఠాయి కొట్టు కూడా పోయింది. పైడిరాజు టీకొట్టు ముందుగోడలూ, సిమెంట్‌బల్లా గునపాల్తో పొడిచేశారు. అంతకుముందున్న చెక్కలు తీసేసి, బోల్డు పెట్టుబడి పెట్టి ఇనుమూ కాంక్రీటూ కలిపి వేయించేడు బల్ల. ప్రతి ఏటా పన్నూ కడుతున్నాడు. మామూళ్లు ఇచ్చుకుంటున్నాడు. పొడిచేసరికి కూలీలకు చేతులకి బొబ్బలెక్కేయి. సైకిలు షాపు దేముంది! తడికలే. మిఠాయి కొట్టు కేవలం చెక్కలు. సులభంగానే లాగేశారు. ఆ అదురుకు మిఠాయి కొట్టు అద్దాల పెట్టె అద్దాలు పగిల్లేయి. గోలగోల పెట్టాడు మాధవ. సైకిలు షాపు సత్యారావు కళ్లలో నీళ్లు తిరిగేయి.

పైడిరాజు పెళ్లం దేవుడమ్మ సర్వశక్తులతోనూ పోరాడింది. ఎంత శక్తులున్నా కుందేళ్లు సింహాన్ని ఎదిరించలేవు. ఆ సింహానికి నక్కజిత్తులు కూడా తోడయితే మరిక చెప్పనక్కర్లేదు. ఆ కారణం చేత దేవుడమ్మ ఎంత పోరాటం చేసినా చివరికి ఏమీ చెయ్యలేక చప్పగా చతికిలబడిపోయింది. అయితే అంత సులభంగా ఓటమినంగీకరించదలుచుకోలేదు. కాయితం మీద రాయడం సంగతలా వుంచి - వినడానిక్కూడా మహాకష్టం, పరమఅసహ్యం కలిగేలాంటి భయంకరమైన నీచాతినీచమైన తిట్లన్నీ తిట్టింది. మేస్త్రీని, సూపర్‌వైజర్నీ తిట్టింది. ఆఖరికి మున్సిపాల్టీ అధికారుల్ని కూడా తిట్టింది. పచ్చిబూతులు, బండ బూతులు తిట్టింది. ఎవరెవరు ఎంతలేసి లంచాలు మింగారో, ఎవరవరు ఎవరెవరితో తొంగున్నారో, ఎవరి పిల్లలు ఎవరికి పుట్టినవారో అన్నీ పూరాగా టముకు వేసేసింది. అవన్నీ నిజమే. కాని ఏం లాభం? తొక్కదలిసరి నాయాళ్లు. పౌరుషం పొడుచుకొచ్చింది గాని, ఆ సమయంలో నోరు మెదిపితేం లాభం? మరింత కందిరీగలపుట్ట చుట్టు పక్కల కందిరీగలన్నీ రెచ్చిపోతాయి. కనుక వెదవనవ్వులు నవ్వుకుంటూ

పూరుకున్నారు. తమపని మాత్రం కానిచ్చేసేరు. టీ కొట్టు ధ్వంసమయిపోయింది. కాంక్రీటుపలకలు ముక్క చెక్కలయిపోయేయి. దేవుడమ్మ రొప్పింది. రొప్పిందిగాని తప్పిందిగాదు. సంసారం రోడ్డునపడిపోయింది.

పైడి రాజు మెతక, గోవులాంటి మనిషి మేసినవాళ్లకి మేసినంత మేపాడు. మరిక చెయ్యదాటి పోయింది. జంక్షన్ ఖాళీగా విశాలంగా బోసిగా కనిపిస్తున్నది. పెద్దపెద్ద షాపుల వారా, పక్కాగానూవున్న బడ్డీలన్నీ ఎగిరిపోయేయి. షాపులవాళ్లు సంతోషించారు. బడ్డీలవాళ్లు లబలబలాడిపోయేరు.

* * *

కోటిపడగల బాలభాస్కరరెడ్డి కేసుగెలిచాడు. అతగాడి వైన్‌షాపు ఒక్కటే అసెంటర్లో తలెత్తుకు నిలబడింది. అది స్పష్టంగా ఆక్రమణని తెలుస్తూనే వుంది. హైకోర్టు స్టేయిచ్చింది. మునిసిపాలిటీ వెనక్కి తగ్గవలిసొచ్చింది. దేవుడమ్మకి ఆ రెడ్డి కథ తెలుసు. సుమారు ముప్పయ్యేళ్ల క్రితం ఆడీవూరొచ్చినాడు. పడమట్న అదేదోగాని ఊరు. కూనీ సేసే వొచ్చేడో, ఎవుడి సొమ్మో అక్రమంగా మింగీసే వోచ్చేడోతెల్దు. అప్పుటికి నాకు సిన్నతనం. పెల్లికాలేదు. సన్నంగ తడికిలాగుండేవోడు. ఐదేళ్లవ్వ బోయితలికి ఎలా కొనీసినాడు. మానాన్న కొందామనుకొనీవాడు. బ్రాందీ సాపెట్టి మరీ పూటెక్కిపోనాడు. పంచాయ్తి మెంబరయినాడు. పెశిరెంటవుదామనుకున్నాడు గాని కుదిర్నాదికాదు. నాయుడు అడ్డం తగిల్నాడు. ఆ తరవాత వైజాగు రోడ్డుకాసి కోళ్లపారం ఎట్నాడు. సినేమాహాలు కట్నాడు. అదేదోగాని జబ్బుతగులుకుందట. మరిపెళ్లందగ్గిర పడుకోనానికి పనికిరాడట. పెళ్లం బంగారు సిలకనాగుంటాది. ఇద్దరు బిడ్డతల్లేగాని కన్నెపిల్లనాగుంతాది. అ యమ్మిని బట్లకొట్టు బంగారిగాడు బొంబాయి లెగదీసుకుపోనాడు. రెడ్డి గూండాల్ని బంపినాడు. ఊరు ఊరల్లా గప్పుమని పోనేదా? ఆయమ్మి తిరిగొచ్చినాది. బంగారిగాడ్ని గూండాల చేత సంపించీసినానుకున్నాడు. కానాడు ఆర్నెల్ల తరవాత వూళ్లొకొచ్చినాడు. బంగారిగాడికి మాజీ ఎమ్మెల్యే బద్దరయ్య దన్నుంది. ఆ బద్దరయ్య గాడెటువంటోడనుకున్నావు. దేవుడమ్మని అడ్డుకోకపోతే మొత్తం వూరు వూరందరి కథలూ చెప్పేస్తూంది. ఎవడు ఏ భూములు ఏయిళ్లు ఆక్రమించుకున్నాడో, ఎవడు ఎవడి ఇల్లాళ్లను ఆక్రమించుకున్నాడో కూడా చెబుతుంది.

భాస్కరరెడ్డి స్టేతెచ్చుకున్నాడని సంబరపడి పోనక్కర్లేదు. జనరల్ ఎలక్షన్లలో ఘోరంగా ఓడిపోయేడు. కష్టం మీద తెలుగుదేశం టిక్కట్టు సంపాదించి రంగంలోకి దిగేడు. దాదాపు పదిలక్షలు భూడిదలో పోసినట్టయిపోయింది. ఏనుగు బతికినా లక్షే చచ్చినాలక్షేనన్నట్టు, ఓడిపోయిన కొద్ది కాలంలోనే పాడిపరిశ్రమాభివృద్ధి సంస్థ ఛైర్మనయ్యాడు. లక్ష ఓట్ల మెజార్టీతో గెలిచిన గాలి లక్ష్మణరెడ్డి పార్లమెంటులో కూచున్నాడు. గాని కాంగ్రెసు పార్టీ కూడా అధికారంలోకి రాలేదు. లక్ష్మణరెడ్డి గెలిచిన పార్టీ అధికారంలోకి రానందుకు బాలభాస్కరరెడ్డి చాలా సంతోషించాడు.

దసరా, దీపావళి రోజుల్లో - రోడ్ల వెడల్పు కోసం ఇళ్లూ, కొట్లూ, బడ్డీలూ కొట్టేసిన ఇటుకల గుట్టలు, నానా కంగాళిగా ఉన్నాది. సంక్రాంతి వెళ్లింది, ఎలక్షన్లు వెళ్లాయి, కొత్తమావాస్య వచ్చినా అలాగే

రోడ్ల వెడల్పు, మురికి కాలవలబాగు ఈ పనులకే కోట్లరూపాయలు ఎలాఖర్చయిపోతుందో ఆ లెక్కలు కూడా జనాలకి తెలియదు.

* * *

మేనెల జోరబడింది. ఎండలు మండిపోతున్నాయి. గాలి వీస్తుంటే అగ్గిరవ్వలు చెరిగినట్టుంది. వడగాల్పులకి ముసలివాళ్లు పండుటాకుల్లా రాలిపోతున్నారని పత్రికల్లో వార్తలొస్తున్నాయి. ఈ ఒక్క పట్టణంలోనే కాదు ఆక్రమణల తొలగింపు తలపెట్టిన అన్ని పట్టణాల్లోను, ప్రాంతాల్లోనూ వేలాదికుటుంబాలు దిక్కులేక ఎండల్లో, గాల్పుల్లో మలమలమాడి పోతున్నాయి.

అప్పోసప్పో చేసి మళ్లీ యిళ్లు నిలబెట్టుకోవడానికి కుదరదు. రేకులు, తడికలు, గోనెలు కట్టుకుని అలాగే కాలం గడుపుతున్నారు.

దేవుడమ్మ ఎండదెబ్బకి శోషవచ్చి పడిపోయింది. ఆ సమయానికి మొగుడు పైడిరాజు దగ్గరలేడు. కూతురు లక్ష్మి కేకలు పెట్టి నలుగుర్ని కూడదీసింది. మొహం మీద నీళ్లుజల్లి ఐస్ సోడా పట్టించారు. సరిగ్గా గుటకన్నా వెయ్యలేదు. కళ్లు తెరిచి చూసి మళ్లీ కళ్లు మూసుకుంది. డాక్టరు దగ్గిరకు తీసుకెళ్లాలనుకున్నారు. "గాభర లేదు మనిసికి కసింతగాలి ఆడనియ్యండి" అన్నారొకరు. మధ్యాహ్నం మూడుగంటలవుతుంది. పనిమీద వెళ్లిన దేవుడమ్మ మొగుడు, కబురు తెలిసి పరుగుపరుగున పారొచ్చాడు. గబగబ రిక్షామీద నాగేశ్వర్రావు డాక్టరు దగ్గిరికి తీసుకువెళ్లాడు. అతను పేదలడాక్టరు. 'కమినిష్టు డాట్రు' ఇచ్చిన వాళ్లదగ్గిర పుచ్చుకుంటాడు. ఇవ్వని వాళ్లని అడగడు. రిక్షా వాళ్లు, కూలీనాలీ చేసుకునీ వాళ్లు, పేదరైతులు, పాలేర్లు ఈ రకం జనం అంతా అతని దగ్గిరికే వెళ్తారు. చూశాడు డాక్టరు. నీరసం, వడదెబ్బతప్ప మరేం అనారోగ్యం లేదన్నాడు. మజ్జిగలో గాని, గంజిలోగాని ఉప్పువేసుకుని తాగమన్నాడు. తన దగ్గిరున్న పౌడరు పాకెట్టిచ్చి, కాచి వడపోసి చల్లార్చిన నీళ్లలో వేసుకుని తాగమని చెప్పాడు. ఒక టానిక్ పేరు రాసిచ్చి కొనుక్కొని తాగమన్నాడు. పైడిరాజు పదిరూపాయిలు డాక్టరుగారి చేతిలో పెట్టబోతే, పుచ్చుకోలేదు. దానికి మరొకపదో పరకో కలిపి టానిక్ కొనుక్కుని తాగమన్నాడు డాక్టరు. ఆస్పత్రి బయటికొచ్చేసరికి ఆకాశంలో మబ్బులున్నాయి. సమయం నాలుగున్నరయుంటుంది. తడికలకొంపకి చేరుకునేసరికి ఆకాశం నలుపెక్కింది. కాటుక పులుముకుంది. దిక్కులన్నీ నల్లగొడుగెత్తుకున్నాయి. గాలిదుమ్ము రేగింది. అది మంచి వ్యాపారం టైము. కరెంటు పోయింది. సుడిగాలి బయల్దేరి ఎక్కడలేని దుమ్మూ రేగుతున్నది. దేవుడమ్మ నీరసంగా నులక మంచం మీద పడుకుంది. నోటినిండా దుమ్ము, కళ్లల్లో దుమ్మూ, నెత్తినిండా దుమ్ము బతుకు బతుకల్లా బుగ్గిరేగినట్టయింది దేవుడమ్మకి. లక్ష్మి తల్లిని లోపలికి తీసుకెళ్లింది. లోపలికంటె రేకుల డబ్బాలోకి. లక్ష్మి తలపైకెత్తి చూసింది. చుక్కలు పొడవవలసిన వేళ. ఒక్కచుక్క కనపడటం లేదు. చుట్టూ చీకటి. అక్కడా అక్కడా పెద్దషాపుల్లో గల డైనమోలు గావును దడదడలాడుతున్నాయి. దీపాలు వెలుగుతున్నాయి. ఆ దీపాలు సర్వాన్నీ ఆక్రమించుకున్న చీకటితో పోరాడలేక నీరసంగా వెలుగుతున్నట్టున్నాయి. లక్ష్మి మొహం మీద ఒక

పెద్దచినుకు. లక్ష్మి గబగబాలోపలికి పరుగెత్తింది. టప్లాటపా రేకులమీద చప్పుడు చేస్తూ చినుకులు. మట్టివాసన, దుమ్ముమవాసన, బుగ్గివాసన, మురికివాసన.. వానపడుతున్నది.

మే నెల పగలు నాలుగ్గంటల్దాకా పెళపెళ పేల్చేసిన ఎండ ఇప్పుడు టపటప దడదడ గుడగుడవాన ముక్కులు పగల గొట్టే దుర్గంధం రేపుతున్నది. వాన జడి హెచ్చింది.

ఇళ్లు లేని జనం తలదాచుకునే దిక్కు లేని జనం వానలో తడుస్తున్నారు. గోనె గుడ్డలు కన్నీళ్లు కారుస్తున్నట్టు నీళ్లోడుతున్నాయి. బట్టపాతలు తడిసిపోయేయి. తుపాకిగుళ్లకు తూట్లు పడిపోయినట్టు వాన చినుకులకే, ఎండిన తడికలు తూట్లుపడుతున్నట్టున్నాయి. టపటపలాడుతున్నాయి. ధూళి రేగిన రోడ్లు క్షణాల్లో బురదమయం బాడిబాడి జారు జారు దాదాపు నలభయి నిమిషాలు వాన నిలబెట్టిబాదింది. తగ్గేసరికి పరిసరాలు గుర్తుపట్టడానికి లేకుండా పోయింది. అల్లక్కడ ఒక చెట్టుకొమ్మ విరిగిపడింది. అదుగో అక్కడ టెలిఫోన్ స్తంభం వొరిగి పోయి తీగలు తెగిపోయాయి. బాలభాస్కరరెడ్డి బ్రాందీషాపు దగ్గిర అందాలబొమ్మల రేకులు ఎగిరి అల్లంత దురాన పడ్డాయి. మురికి కాలవల్లో నీరు రోడ్డు మీద కెగబాకింది. ముద్దలు ముద్దలు తేలుతున్నాయి. ఆ వాసనకి ముక్కు లెగిరిపోతున్నాయి. దోమలు విజృంభించాయి.

కరెంటొచ్చింది. దేవుడమ్మ ఓపిక తెచ్చుకుని లేచింది. ఆ చుట్టుపక్కల మురికి నీరంతా చెక్కల కింద చప్పుడు చేసుకుంటూ-పరుగులు తీస్తున్నాది. ఆ చక్కల మీద నుంచునే దేవుడమ్మ స్టౌ ముట్టించింది. పైడిరాజు బయటికొచ్చి చుట్ట ముట్టించుకున్నాడు. ఇది ఊరా వల్లకాడా? లక్ష్మి తల్లికి సాయం చేసింది. ఇన్ని బియ్యం ఉడకేసుకున్నారు. పైడిరాజు సిల్వర్ కేరేజీ తీసుకెళ్లి హొటేల్నించి సాంబారు తెచ్చాడు. మొదటాట సినేమాజనం ఆబురదలోనే విసుక్కుంటూ, నవ్వుకుంటూ, బూతుజోకులు వేసుకుంటూ ఇళ్లకి బయల్దేరేరు. ఆ రేకులచాటునే తల్లి ముగ్గురూయింత ఎంగిలిపడ్డారు. దేవుడమ్మ మనసంతా సకల బీభత్సంగానూ వున్నాది.

⋆⋆⋆

బడ్డీకొట్ల స్థానంలో చక్రాలబళ్లొచ్చాయి. కొట్టేసిన సిమెంటుకొట్ల స్థానంలో పేకేజీ చక్కల్తోనూ, రేకుల్తోనూ నిలబెట్టిన కొట్లొచ్చాయి. గట్టిగా అదిలిస్తే చక్రాలబళ్లు తీసుకుపోతారు. ఈ సెంటర్లో తరిమితే ఆ సెంటరూ ఆ సెంటర్లో తరిమితే ఈ సెంటరూ.

దేవుడమ్మకి టీకొట్టు నడపాలో వద్దో తెలియడం లేదు. మరో ఆధారం లేదు. దిక్కుతోచడం లేదు. పైడిరాజు ఎవరికాళ్లో పట్టుకుని ఒక పాత చక్రాలబండి తెచ్చాడు. తుప్పుపట్టిన చక్రాలు, టైర్లూ చూబులూ వున్నాయిగాని పనికిరావు. నూనె గుడ్డతో తుడిచి శుభ్రం చేశాడు. ఆ బండికింద సామాను పెట్టుకోవచ్చు. ఉదయం ఉప్మా, ఇడ్లీ, టీ చేస్తారు. సాయంత్రం బజ్జీలు, పకోడీలు చేస్తారు. ఏ వేళవచ్చినా బన్ రొట్టిలు వుండనే వుంటాయి. బేరం ఒక మాదిరిగా వుంది. కాస్త వూపిరి వచ్చింది.

కాని ఎన్నాళ్లిలా? నడిరోడ్డు మీద, చెట్లకింద, తడికల చాటున కాపురం ఇంకెన్నాళ్లు? ఒకగుట్టు లేదు. ఒక చాటూ మాటూ లేదు. తెల్లారి లేస్తే పదిమంది కళ్లల్లోపడాలి.

కలిగిన వాళ్లు ఉన్న కాస్త జాగాలోనే రిపేర్లు చేయించుకున్నారు. మెట్లు చిన్నవిచేసి కట్టించుకున్నారు. పక్కగోడలు కట్టించుకున్నారు. లేనివాళ్ల బతుకూ, మరీ దేవుడమ్మ లాంటి వాళ్ల బతుకూ అధ్వానంగా తయారయింది. లక్ష్మి పదోతరగతి చదువు ఇక ఆగిపోయినట్టే.

దేవుడమ్మ తోటివాళ్లు కొందరు అప్పులు చేసి, కొందరు ఉన్నమేరకి ఆడవాళ్ల వంటిమీద బంగారుపిసరు తెగనమ్మి కొంపనిలబెట్టుకుంటున్నారు. ఆర్ అండ్ బీ వాళ్లతోనూ మునిసిపాలిటీ వాళ్లతోనూ మళ్లీ పేచీయే. చిన్న చితకా వ్యాపారస్తులకి ట్రాఫిక్ పోలీసుల బెడద సరేసరి. ఒకోసారి హెల్తు డిపార్టుమెంటు వాళ్లు తయారయిపోతారు. ప్రతివాడూ వచ్చి ఆథారిటీ చెలాయించడమే. వాళ్లని బ్రతిమాలుకుని కాళ్లా వేళ్లా పడి వందాయాభై యిచ్చుకుని ఆ క్షణానికి ఆగండం గట్టెక్కిందనిపించుకోవడం దినదిన గండం నూరేళ్ల ఆయుష్షు అన్నచందంగా తయారైంది బ్రతుకు.

ఆక్రమణలు తొలగించడం నిజమయితే ముందుగా ఎగిరిపోవలసింది సాయిబాబా గుడి, బాలభాస్కరరెడ్డి బిల్డింగు, ఆయన జంక్షనులో కట్టించిన వరసకొట్లు ఆ కొట్ల జోలికి వెళ్లడానికి ఎవరికీ దమ్ములేవు. మరీ లేదనకుండా కొట్ల ముందు మెట్లు సగం సగం తెగ్గొట్టారు. ఒక నెలతరవాత ఆమెట్లే వేరేషేపులో మరింత దిట్టంగా తయారయ్యాయి. చిన్న బజారు సందులో బంగారు దుకాణాలు చెరిసగానికి ఎగిరిపోవాలి నిజానికి. అవి స్వర్ణకారులవయితే ఆపని ఏనాడో జరిగిపోను. అవన్నీ షాపుకార్లవీ, మారువాడీలవీను. అంచేత కొట్లముందు మెట్లు గునపాల్తో సగం సగం పొడిచారు. ఒకనెల తరువాత మళ్లీయధాప్రకారం మెట్లు లేవనే లేచాయి. పెద్ద ఉద్యోగస్తుల జేబులు నిండాయి. వాళ్లని అనుసరించి బ్రతికే చిన్న ఉద్యోగస్తులకు చిల్లరఖర్చులు తీరాయి. ఆక్రమణల తొలగింపు విజయవంతమైంది.

★ ★ ★

సవరం మాలక్ష్మి చెప్పిన సులువు బాగానే కనిపించింది దేవుడమ్మకి మునిసిపాలిటీవాళ్లకి రెండువేలిచ్చుకుంటే కొట్టేసిన యిల్లు యధాప్రకారం కాకపోయినా చిన్న చిన్న మార్పులతో బాగా కట్టుకోవచ్చు. మునిసిపాలిటీవాళ్ళు వెడల్పు చేసికట్టించిన మురికి నీటి కాలవమీద పలకలు పరిస్తే - బడ్డీకూడా ఒకరకంగా తయారయిపోతుంది. పదిపన్నెండు కుటుంబాలవాళ్లు తలారెండు వేలూ ఎత్తి, దీపాలు పెట్టాక, కలవవలసిన వాళ్లని కలసి, చెప్పుకోవలసింది చెప్పుకున్నారు. నెలా, రెండు నెలలయ్యేసరికి కాస్తాకాస్తా ఇళ్లూ కొట్లూ ఒక రూపానికి వచ్చాయి. నలుగురితో నారాయణా, గుంపులో గోవిందా - అని దేవుడమ్మ కూడా సవరం మాలక్ష్మి దోవకేనడిచింది. అనుకున్న రెండువేలూకాక - పైన మరోవెయ్యి వరకూ ఖర్చయింది. పెళ్లినాటి బుట్టలోలకులు, పాడయి పోయాయాని రేకుపెట్టి అడుగునపడేసినవి, తీసి అమ్మేసింది. దేవుడమ్మ తల్లిది ముక్కు పుడకా ఆబాపతు చిన్నచితకా అన్నీ తీసి అమ్మేసింది.

కొంత అప్పుతెచ్చింది. మొత్తానికి ఎలాగో బంగాళా పెంకుల్తో చిన్న ఇల్లూ, సిమెంటు రేకుల్తో

టీ కొట్టూ తయారయింది. ఆఫీసర్ల చుట్టూ, గుమస్తాలచుట్టూ, బంట్రోతుల చుట్టూ తిరిగి తిరిగి దేవుడమ్మకి నీరసం వచ్చేసింది. తాపీ మేస్త్రీల్లతోనూ తగువే మళ్లీ వాళ్లు బాగా తెలిసిన వాళ్లు. తెల్లారి లేస్తే తనకొట్టుదగ్గిరికి వచ్చేవాళ్లే. ఎద్దుపుండుకాకికి రుచంటారు. పేదవారి మీద పేదవాడికి జాలివుంటుందా? ఉన్నా లోకం ఉండనిస్తుందా?

డబ్బు తప్ప ఈ లోకంలో ఇంకేమీ లేదా? పాపం, పుణ్యం, మంచీ చెడ్డ, మానాభిమానాలూ అన్నీ అబద్ధాలేనా? దేవుడమ్మకి మతిపోతుంది. ఆలోచిస్తున్న కొద్దీ మనిషిని మనిషి పీక్కు తినడానికే ఇయన్నీకల్పించేరా అని అనిపించింది. సవరం మాలక్ష్మి పని బాగుంది. దాని మొగుడు సంపాదనాపరుడు. తాగడు. పైగా దాని బంధుగులు అంతోయింతో సాయం చేశారు. గబగబలాడుతూ డాబాయిల్లు లేపింది. నిశ్చింతగా వుంది. డబ్బు వుంటే అంతా నిశ్చింతే. అది లేకపోతే అంతాచింతే-

ఎవరు ఎవర్ని ఆక్రమిస్తున్నారు? ఎవరు ఎవర్ని దోచుకుంటున్నారు? నిజంగా ఈ మేడలూ మిద్దెలూ ఈ బిల్డింగులూ, లాడ్జింగులూ ఉన్నవాళ్లు వీటిని నీతిగా, న్యాయంగా కష్టపడి చెమటోడ్చి సంపాయించేరా? దొంగ వ్యాపారాలు, మడత పేచీలు, లాలూచీలు, కుతంత్రాలు, కుహకాలు ఎన్నిచేస్తే ఇవన్నీ వాళ్లపరం అయ్యేయో? ఎవరెవరి భూములు, భవనాలు ఎవరెవరు ఆక్రమించారో! దేవుడమ్మకి వున్నది బొటాబొటీ కటాకటీ రెండుసెంట్లు. అందులో రోడ్లు వెడల్పు పేర "సెంటుస్తళం దొబ్బేరు" నష్టపరిహారం ఇస్తామన్న గొల్లిగాళ్లు కాణీఇచ్చేరుకారు. నిజానికి ఆ స్తలం నీది కాదన్నారు. నువ్వు ముందుకొచ్చీ సేసన్నారు. కాయితం చూపించుమన్నారు. తనకాడ కాయితాల్లేవు. మాయజేసి కాయితాలు సృష్టించినోళ్లు బాగానే వున్నారు. కాయితాలు పుట్టించి ఇంత తిరకాసు చేస్తారని, చెయ్యొచ్చనీ దేవుడమ్మకి మొదట్లో తెలిసిందికాదు. ఇలా చాలా మంది దెబ్బతిన్నారు. దెబ్బతిన్నవాళ్లంతా దిక్కులేని నాదారోళ్లే. వానొచ్చినా వరదొచ్చినా దెబ్బతిన్నదీ బీదాబిక్కీయే. కరువుకాటకాలొస్తే చచ్చేదీ పేదోళ్లే. పేదోళ్లు బతకడానికి దోవలేదు. పేదవాళ్లని పెద్దపెద్ద వాళ్లాక్రమిస్తున్నారా? వాళ్లని పేదవాళ్లాక్రమిస్తున్నారా? ఆలోచిస్తున్న కొద్దీ దేవుడమ్మకి బుర్రంతా తేళ్లూ, జెర్రులూ పాకినట్టయింది. పాములు బుసకొట్టినట్టయింది.

* * *

ఉదయం ఎనిమిది గంటల సమయం. దేవుడమ్మ టీ కొట్టు మంచిరద్దీ మీదవుంది. లక్ష్మి కూడా తల్లికి సాయంగా కొట్టుమీదే వుంది. మునిసిపల్ ఆఫీసు బంట్రోతు సైకిలు మీద దిగేడు. అర్జంటుగా ఆఫీసరుగారు ఐదొందలు పట్రమ్మన్నారట. లేకపోతే మురికి కాలవమీద పలకవేసి కొట్టు కట్టినందుకు కేసు పెడతారట. పగల గొట్టించేస్తారట. కొంప మునిగిపోతుందట.

"ఇదేం గోస నాయ్నా నా దగ్గిరేటి సొమ్ము మూలుగుతుందనుకున్నావా? సావుకారమ్మనను కున్నావా? ఎక్కణ్ణించి తెచ్చేదీ? ఇదిగిలాగ నానాపుర్రాకులు పడి దినం దీర్చుకుంటన్నాం. మమ్మల్నిలా బతకనియ్యరా" అని గొల్లుమన్నది. గయ్యి మనేదే. నోటి ప్రతాపం చూపించేదే. బేరం

టైమ్ గనుక ఊరుకుంది.

"అదేం కుదర్దు" అన్నాడు బంట్రోతు, అంతా ఆలకించి.

"నన్ను సంపినా నాకాడ సొమ్ములేదు". అన్నాది దేవుడమ్మ.

"పోనీ సాయింత్రం చీచ్చేదా" అన్నాడాఖరికి.

"ఎప్పుడొచ్చినా ఇదే మాట. నాకాడ కాణీ లేదు" అని కరాకండీగా చెప్పేసింది. ఈ గోలకి ఒకరిద్దరు ఇటు తన టీకొట్టుకి రావలసినవాళ్లు అటుయిటూ పోయారు. బేరం పోయింది.

"సాయంత్రం వస్తాను. ఎలాగో సర్దుబాటు చెయ్యక తప్పదు. తరువాత నువ్వే నష్టపోతావు" అని చెప్పి బంట్రోతు రుసురుసలాడుతూ వెళ్లిపోయాడు.

ఆనోటా ఆనోటా దేవుడమ్మ చాలా మాటలు విన్నాది. ఈ టౌనులో ఆక్రమణల తొలగింపు మీద. రోడ్లు వెడల్పు చెయ్యడం మీదా ప్రపంచబ్యాంకు ఎందుకన్నేసి కోట్ల రుణాలిచ్చిందో దేవుడమ్మకి బోధపళ్లేదు. విశాఖపట్నం ఉక్కు ఫాక్టరీకి అదేదో దేశం సాయం చేసిందట. అమెరికావాడు గాని, జపానువాడుగాని, జర్మనీవాడుగాని మరి దేనిదేనికి ఏం ఆశించి సాయం చేస్తున్నాడో సమంగ తెలీలేదు. సొమ్ము రుణం ఇచ్చినోడు వడ్డీ తీసుకోకుంట వూరుకోడని మాత్రం దేవుడమ్మకి కచ్చితంగ తెలుసు. ఇన్నేసికోట్లు రుణానికి వడ్డీకూడా తప్పకుండా కోట్ల మీదే వుంటాదని దేవుడమ్మకి అంచనా అయ్యింది. మరి ఎక్కడికక్కడ సొమ్ము మింగే నాయకులూ, పెద్దపెద్ద ఆఫీసర్లూ రుణం తీరుస్తారా ఎగ్గొడతారా? దేశాన్ని గాని ఏ తాకట్టో పెట్టేస్తారా? కడకి తెగనమ్మేస్తారా? దేవుడమ్మ బుర్రకి ఇవన్నీ పెద్ద సంగతుల్లా కనిపించేయి. ఒక భయం మాత్రం వేసింది. అస్పష్టమైన భయం అది. ఇదంతా రాముడి పేరుజెప్పి రాజ్యం ఏలడానికొచ్చినోళ్లు చేస్తున్నారా అన్నది ప్రశ్నగానే మిగిలిపోయింది. ఆళ్లూ ఆళ్ల కుమ్మక్కుదార్లు చేస్తున్నట్టు తెలిసిపోతున్నాది.

దేవుడమ్మకి విశాఖపట్నంలో చుట్టాలున్నారు. అక్కడకూడా ఇలాగే వున్నాదట పరిస్థితి. బీదాబిక్కీ బతకడం కష్టంగున్నాదట. ప్రతివోడూ పేదోళ్లని పట్టుకు పిండేస్తున్నారట. ఇదంతా చూడగా పెద్దదేశాలవాళ్లు చిన్నదేశాలవాళ్లనీ, ఆ చిన్న దేశాలవాళ్లు ఇంకా, చిన్న దేశాలవాళ్లనీ ఆక్రమించుకోవాలనీ, మింగెయ్యాలనీ చూస్తున్నట్టు అనుమానం తోచింది దేవుడమ్మకి.

మధ్యాహ్నం మూడుగంటలు దాటి వుంటుంది. పెద్దగా బేరం వుండదా టయిములో ఒక్క సిటం అలా శారబడింది. మాగన్నుపట్టింది. అంతా కలత కలత గానూ బెదురు బెదురుగానూ వున్నాది. సవరం మాలక్ష్మి లేపుతుంటే తుళ్లిపడిలేచింది. ఒక్క గడి ఎర్రి సూపులు సూసింది.

"నీను సవరం మాలక్ష్మిని, యేటా ఎర్రిసూపు" అన్నది బుజం పట్టివూపి. తెలివి తెచ్చుకుంది దేవుడమ్మ. ఆ పక్కనే లగడు రాజులమ్మ కూడా వుంది. మాలక్ష్మి చెప్పుకు రావడం ప్రారంభించే సరికి అంతా బోధపడిపోయింది.

"ఏ మాటకామాటే సెప్పుకోవాలి. మనం సితికి పోయనోళ్లమేకాని బొత్తిగా పస్తులుండటం లేదు కదా. మనకంటా గతిలేనోళ్లున్నారు. ఆళ్ల మాటేటి" అన్నాది లగుడు రాజులమ్మ. లగుడు వాళ్లంతా ఉన్నవాళ్లే. రాజులమ్మే బొత్తిగా కూటికి కటకటలాడిపోతుంది. "సెడిపోయినోళ్లని ఎవరాదుకుంటారు? నువెన్ని సెప్పు - ఆ దేవుడూ కూడా సూడ్డు" అన్నాది రాజులమ్మ.

"మనం ఎవరి జాగవా ఆక్రమించుకోలేదు. ఎవరి సొమ్ము పడిసేసుకోలేదు. మరి మనకెందుకొచ్చినగోస".

ఇంచుమించు అందరి మనసులోనూ ఇదే మాట.

రాజులమ్మ మొగుడు రోజుకూలీ. రాజులమ్మ కూడా కొన్నాళ్లు రోజుకూలికి వెళ్లిందిగాని, గుండెజబ్బు జాగర్తని చెప్పేడు నాగేశ్వరరావు డాక్టరు. అందుకని మానేసింది. నాలుగిళ్లలో పనిచేసుకుంటుంది. రాజులమ్మ పాకా పీకేశారు. ఇద్దరు పిల్లల్తోటి చాలా కవుకులు పడుతున్నాది.

అందరూ కలసి గట్టిగా నిలబడాలన్న ఆలోచన వచ్చింది. సవరం మాలక్ష్మి పిరికిదాయి. లగుడు రాజులమ్మ బుర్రలో శేనా సంగతులున్నాయి.

"కనీసం మన టౌన్లున్నోళ్లమయినా కలిసికట్టుగుంటే ఆక్కురమణల సంగతేటో తేలిపోద్ది. మనం ఎవులిజాగా ఆక్కురమించుకోనేదు. ఆ మాట కొస్తే మన బతుకులు ఆల్లే ఆక్కురమించుకున్నారు. ఆరుగాలం కష్టపడుతన్నా మనకి దినం దీరకకంటంది. సెమట పట్టకండ పంకా కింద కూకున్నోడికి అన్నేసి బిల్డింగులు, అన్నేసి బూములు, అంతలేసి సొమ్ము ఎక్కడకాన్నించొచ్చింది? ఆల్లే మన కష్టం ఆక్రమించుకున్నారన్నమాట కద. మరందుకే మనం గట్టిగ నిలబడాలని నరవ నారాయుడునేడా? ఆడు సెప్పినాడీ సంగతులల్ల..."
దేవుడమ్మకి ఈ మాటలు నచ్చేయి.

ఇంకా చాలమంది పేర్లు చెప్పింది రాజులమ్మ. చిన్నదే అయినా, ఒక గదికాడికే అయినా సవరం మాలక్ష్మి డాబా కట్టింది కదా. కనక సవరం మాలక్ష్మి కలవదని తేలిపోయింది.

"సస్తే ఒకపాలేకదా. ఆ సంగతిదో తేలిపోవాలి. ఈ పాలి ఎవుడన్నా ఈ శేయలకి రావాల. ఆడమ్మడాలి.." అని తొడ సరిసినంత పనిచేసింది దేవుడమ్మ. రాజులమ్మ కూడా సైయంటే సై యంది.

దేవుడమ్మ వాలకం చూసి సవరం మాలక్ష్మికి నోట మాటరాలేదు.

***రచనాకాలం : 1998, ప్రచురణ : వంశధార కథలు , శ్రీకాకుళంసాహితి ప్రచురణ, ఫిబ్రవరి 1999***